సాక్షి గుంటూరు

బుధవారం, 10, జూలై, 2024



అన్నదానం

గురజాల: పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయం ఆవరణలో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం అన్నదానం నిర్వహించారు.



ఆకస్మిక తనిఖీలు

రెంటచింతల: మండలంలోని విత్తనాలు, పురుగుమందుల షాపులను రాష్ట్ర వ్యవసాయ, విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

అఖండజ్యోతి ప్రజ్వలన



వినుకొండ(నూజెండ్ల): వితంరాజుపల్లి శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో మన ఊరు – మన కొండ కార్యక్రమంలో భాగంగా ఈనెల 17న తొలి ఏకాదశి సందర్భంగా కొండపై తృతీయ అఖండ జ్యోతి ప్రజ్వలన చేయనున్నట్లు హిమాలయ గురూజీ తెలిపారు.

న్యూస్‌రీల్

సిలబస్ సకాలంలో పూర్తి చేయాలి

జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలల్లో సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని డీఈఓ పి.శైలజ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని అనంతవరప్పాడు, కాట్రపాడు, వింజనంపాడు, వట్టిచెరుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల్లోని అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను షెడ్యూల్ ప్రకారం బోధించడంతోపాటు విద్యార్థుల్లో సబ్జెక్టు పరమైన విజ్ఞానాన్ని పెంచాలని సూచించారు. అనంతరం పీఎం పోషణ్ (మధ్యాహ్న భోజన పథకం)ను తనిఖీ చేశారు. మెనూ కచ్చితంగా పాటించాలని సూచించారు. డీఈఓ శైలజ వెంట ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. భాష్యం కాలేజీలతోపాటు జాస్పర్ ఇండస్ట్రీస్, టెక్‌బీఎం, స్కిల్స్‌క్రాఫ్ట్ సంస్థల్లో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, పీజీ, ఎమ్మెస్సీ (జేఎల్స్ ఇన్ మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ) వరకు చదువుకున్న 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్లతోపాటు ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 98668 22697, 87907 90762 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

12న భవిష్యనిధి పెన్షన్ అదాలత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు కృష్ణనగర్‌లోని భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయంలో ఈనెల 12న పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఎస్.శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పీఎఫ్ పెన్షనర్లు వారి ఫిర్యాదులు, దర్ఖాస్తులను నేరుగా భవిష్యనిధి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న పెన్షన్ అదాలత్‌లో సమర్పించవచ్చని తెలిపారు. వ్యక్తిగతంగా హాజరు కాలేని వారు ఆన్‌లైన్, వాట్సాప్, వెబ్ మార్గాల ద్వారా పంపవచ్చని సూచించారు. ro.guntur@epfindia.gov.in తోపాటు వాట్సప్ నంబరు 94946 57469కు పంపాలని తెలిపారు. ల్యాండ్‌లైన్ నంబర్లు 0863-2344106, 2232921 నంబర్లో సంప్రదించాలని సూచించారు. అలాగే వెబ్ ఎక్స్ ఐడీ 2644 170 9396, పాస్‌కోడ్ epfo@1234 ద్వారా లాగిన్ కావాలని తెలిపారు.

డెప్యూటీ మేయర్ కార్యాలయంపై దాడి నేపథ్యంలో కేసు

గుంటూరు ఈస్ట్: గుంటూరు నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్ కార్యాలయంపై జరిగిన దాడి ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం డెప్యూటీ మేయర్ బాలవజ్రబాబు కార్యాలయంపై టీడీపీ కార్యకర్తలు రౌడీషీటర్ మధు, నరేష్ దాడిచేసిన విషయం విదితమే. ఈఘటనపై బాలవజ్రబాబు అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేబ్రోలులో 23.4 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా చేబ్రోలు మండలంలో 23.4 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా పెదకాకాని మండలంలో 1.4 మి.మీ వర్షం పడింది. సగటున 3.5 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. దుగ్గిరాల 5.8, తెనాలి 4.6, పెదనందిపాడు 4.2, ప్రత్తిపాడు 4, తుళ్ళూరు 3.8, వట్టిచెరుకూరు 3.4, పొన్నూరు 3, కాకుమాను 2.6, గుంటూరు తూర్పు 2.2, గుంటూరు పశ్చిమ 2, తాడికొండ మండలంలో 1.8 మి.మీ చొప్పున వాన కురిసింది.

స్త్రీ,పురుషులు పనిచేసే చోట ఇంటర్నల్ కమిటీలు ఉండాలి

నరసరావుపేట: పది మంది అంతకంటే ఎక్కువ పురుషులు, మహిళలు కలిసి పనిచేసే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఇంటర్నల్ కమిటీలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ లీగల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సుధాకర్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణపై సీడీపీవో ఆధ్వర్యంలో అధికారులు, పోలీసులకు సదస్సు నిర్వహించారు.

5 స్టాక్ పాయింట్లలో ఇసుక

- పారదర్శకంగా సరఫరా
- టన్ను ధర రూ.250 రోజుకు ఒకరికి 20 టన్నులే
- కలెక్టర్ నాగలక్ష్మి



లింగాయపాలెం రీచ్‌ను పరిశీలించి డ్రైవర్లను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మి, చిత్రంలో ఎస్పీ తుషార్ డూడీ

తాడికొండ: గుంటూరు జిల్లాలో కొల్లిపర, మున్నంగి, గుండిమెడ, తుళ్ళూరు మండలం లింగాయపాలెం, తాళ్లాయపాలెం (మొత్తం ఐదు) స్టాక్ పాయింట్ల ద్వారా ఇసుక సరఫరా చేస్తున్నట్లు గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. మంగళవారం ఎస్పీ తుషార్ డూడీతో కలిసి తుళ్ళూరు మండలం తాళ్లాయపాలెం, లింగాయపాలెం ఇసుక స్టాక్ పాయింట్లను ఆమె పరిశీలించారు. రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బందికి సూచనలు చేశారు. డిజిటల్ పేమెంట్ క్యూ ఆర్ కోడ్‌కు సాంకేతిక సమస్యలు ఉన్నాయా అనేది అడిగి తెలుసుకున్నారు. వాహనాల రద్దీని నియంత్రించి సమస్య లేకుండా ఇసుక లోడింగ్ అయ్యేలా పోలీసులు పర్యవేక్షించాలని కోరారు. స్టాక్ పాయింట్ వద్ద ఇసుక సరఫరా పనులను పర్యవేక్షిస్తున్న సిబ్బందికి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆమె ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ జిల్లా స్థాయి శాండ్ కమిటీ నిర్ణయం మేరకు టన్ను ఇసుక ధర రూ.250గా నిర్ణయించామని, మండల స్థాయి కమిటీ ద్వారా రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, స్వయం సహాయక సంఘ సభ్యులను బృందంగా ఏర్పాటు చేసి ఇసుక సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నూతన మార్గదర్శకాల ప్రకారం ఒక్క రోజుకు ఒక్క ఆధార్ కార్డుకు 20 టన్నుల ఇసుకను మాత్రమే అందిస్తామని చెప్పారు. లింగాయపాలెం ఇసుక స్టాక్ వద్ద నాలుగు పొక్లెయిన్ల ద్వారా గంటకు 15 వాహనాలకు ఇసుక లోడింగ్ జరుగుతున్నట్లు తెలిపారు. తుళ్ళూరు మండలంలోని రెండు రీచ్‌లలో కలిపి 6 లక్షల టన్నుల ఇసుక ఉందని, జిల్లాలో మిగిలిన అన్ని రీచ్‌లలో 8.5 లక్షల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. స్టాక్ పాయింట్‌లో ఏదైనా సమస్యలు, ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 0863-2234301, మెయిల్ ఐడీ డీఐఎస్ఎంసీ2024@జీమెయిల్.కామ్‌కు ఫిర్యాదు చేస్తే తక్షణం చర్యలు తీసుకుంటామని వివరించారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించే క్రమంలో ఇసుకను మనుషులతో లోడింగ్ చేస్తే బాగుంటుందని విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ ఒకటి లేదా రెండు వారాల తరువాత కమిటీలో చర్చిస్తామని వివరించారు. అన్ని శాఖల సమన్వయంతో పారదర్శకంగా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గనుల శాఖ డెప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, తుళ్లూరు మండల తహసీల్దార్ సుధీర్, ఎంపీడీఓ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

గుంటూరు వెస్ట్: జిల్లాలో చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సక్రమంగా అందేట్లు చూడాలన్నారు. గర్భిణులు బరువు తగ్గకుండా, వారికి రక్త హీనత రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆశా, ఏఎన్ఎం, మహిళా పోలీసులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల పెరుగుదల కోసం అందిస్తున్న బాలామృతం సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అంగన్‌వాడీలకు నిర్దేశించిన సమయాల్లో పక్కాగా సరుకులు చేరేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహిళలపై గృహ హింస, లైంగిక వేధింపుల కేసులను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టడంతోపాటు చిన్నారులపై లైంగిక వేధింపులు జరగకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా స్త్రీ శిశు మహిళా సంక్షేమాధికారి ఎం.ఉమాదేవి, నోడల్ అధికారి శ్రీవాణి, జిల్లా బాలల పరిరక్షణాధికారి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

బాధ్యతగా హెల్మెట్లు ధరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): మోటారు సైకిళ్లపై రాకపోకలు సాగించే సమయంలో వాహన చోదకులు బాధ్యతాయుతంగా హెల్మెట్లు ధరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి చెప్పారు. ఏపీ హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (అమరావతి) ఆదేశాల మేరకు రెండోరోజు మంగళవారం గుంటూరు నగరంపాలెం జిల్లా కోర్టు ఆవరణలో 'హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం, శిక్షార్హం, మోటారు వాహనాల చట్టాలపై కోర్టు సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ అతి వేగంతో వాహనాలు నడపొద్దని చెప్పారు. ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే ఆ కుటుంబ జీవన, ఆర్థిక పరిస్థితి చాలా ఇబ్బందిగా ఉంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. పిల్లలకు మోటారు సైకిళ్లను ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. సంస్థ జిల్లా కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా రహదారులపై మరింత నెమ్మదిగా వెళ్లాలని వాహన చోదకులకు సూచించారు. హెల్మెట్ ధరించి ప్రయాణిస్తే అందరికీ సురక్షితమని చెప్పారు. కోర్టు విధులకు ద్విచక్ర వాహనాలపై వచ్చే ప్రతి ఉద్యోగి విధిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. సదస్సులో కక్షిదారులు, కోర్ట్ సిబ్బంది, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు ర్యాలీ

బుధవారం ఉదయం 9 గంటలకు గుంటూరు నగరంపాలెం జిల్లా కోర్టు నుంచి హెల్మెట్లతో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి మంగళవారం తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి, ఎస్పీ తుషార్ డూడీ, డీటీసీ తదితరులు ర్యాలీలో పాల్గొంటారని వివరించారు.

'ఐరన్ మ్యాన్' అనిల్ కుమార్

- ట్రైథ్లాన్‌లో సత్తా
- అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ
- ఉన్నత ఉద్యోగంతోపాటు క్రీడా సాధన



స్విమ్మింగ్‌లో అనిల్ కుమార్



సైక్లింగ్‌లో పోటీపడుతున్న అనిల్ కుమార్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం, చక్కని కుటుంబం ఉన్నా ఇంకా ఏదో సాధించాలనే తపన ఆ ఉన్నతాధికారిని విజయతీరాలకు చేర్చింది. అకుంఠిత దీక్ష.. కఠోర శ్రమ.. అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొచ్చాయి. ఐరన్ మ్యాన్ ట్రైథ్లాన్‌లో విజేతగా నిలిపాయి. గుంటూరుకు చెందిన జె.అనిల్ కుమార్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో సీనియర్ మేనేజర్. ఆయన విధులు నిర్వహిస్తూనే గత నెలలో జర్మనీలోని హాంబర్గ్‌లో జరిగిన ఐరన్ మ్యాన్ ట్రైథ్లాన్ పోటీల్లో పాల్గొన్నారు. నిర్ణీత సమయాని కంటే ముందుగానే కఠోర లక్ష్యాలను అధిగమించి శభాష్ అనిపించుకున్నారు. రాష్ట్ర కీర్తిపతాకను విశ్వ యవనికపై రెపరెపలాడించారు.

మలుపు తిప్పిన గుంటూరు బదిలీ

అనిల్ కుమార్ స్వస్థలం చిత్తూరు. ఉద్యోగ రీత్యా అనేక రాష్ట్రాలు తిరుగుతూ కరోనా సమయంలో గుంటూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడి సైక్లిస్ట్, స్విమ్మర్స్ పరిచయంతో ఆయనలోని అథ్లెట్ మళ్లీ మేల్కొన్నాడు. దీంతో ఆయన సాధన ప్రారంభించారు. అన్ని విభాగాల్లోనూ రాటుదేలారు. కఠోర సాధన చేయాల్సి రావడంతో మొదట్లో ఆయన భార్య కొంత ఆందోళన చెందినా ఆయన ఉత్సాహం చూసి సహకరించారు.

ఐరన్ మ్యాన్ ట్రైథ్లాన్ అంటే ఏమిటి!

ఐరన్ మ్యాన్ ట్రైథ్లాన్‌లో ప్రధానంగా మూడు విభాగాలు స్విమ్మింగ్, సైక్లింగ్, రన్నింగ్ ఉంటాయి. నిర్వాహకులు నిర్ణయించిన సమయంలో వాటిని ఎటువంటి విశ్రాంతి తీసుకోకుండా పూర్తి చేయాలి. జర్మనీలోని హాంబర్గ్‌లో గత నెలలో నిర్వహించిన ఐరన్ మ్యాన్ ట్రైథ్లాన్ పోటీల్లో 70 దేశాల నుంచి సుమారు 2,500 మంది అథ్లెట్స్ పాల్గొన్నారు. స్విమ్మింగ్ 3.8 కిలోమీటర్లను 2.20 గంటల్లో, సైక్లింగ్ 180 కి.మీ.ని 7.10 గంటల్లో రన్నింగ్ 42.2 కి.మీ.ని 6 గంటల్లో మొత్తం ఈ మూడు విభాగాలను 15 గంటల 30 నిమిషాల్లో పూర్తి చేయాలని నిర్వాహకులు నిబంధనలు విధించారు. అనిల్ కుమార్ 13 గంటల 9 నిమిషాల్లోనే ఈ మూడింటినీ పూర్తిచేసి ఐరన్ మ్యాన్‌గా నిలిచారు. ఆయనతోపాటు కోచ్ రుషిల్, సీనియర్ అథ్లెట్ రవీంద్ర కూడా పాల్గొన్నారు. ఇది ఎంతో రిస్క్‌తో కూడుకున్న క్రీడ మాత్రమే కాదు ఆర్థికంగా కొంత ఖర్చుతో కూడుకున్నదని వారు చెప్పారు.

ఈ సాధన కొనసాగుతుంది



కరోనా సమయంలో గ్రూప్ స్పోర్ట్స్‌కు బదులుగా వ్యక్తిగత క్రీడలైన స్విమ్మింగ్, సైక్లింగ్, యోగాలాంటి వాటిపై ఆసక్తి బాగా పెరిగింది. రోజూ క్రమం తప్పకుండా సాధన చేస్తుంటాను. ఒక్క నిమిషం కూడా వృథా చేయడానికి ఇష్టపడను. ఐరన్‌మ్యాన్‌గా గుర్తింపు సాధించిన తర్వాత నా ఆత్మ స్థైర్యం మరింత పెరిగింది. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొంటాను. నాకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు.

– జె.అనిల్ కుమార్, అథ్లెట్

వైభవంగా జగన్నాథస్వామి రథయాత్ర



రథంపై జగన్నాథస్వామి, ఇస్కాన్ ప్రతినిధులు

తెనాలి: పట్టణ నాజరుపేటలోని ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో మంగళవారం జగన్నాథస్వామి రథయాత్ర కన్నుల పండువగా నిర్వహించారు. పూరీలో జగన్నాథస్వామి రథయాత్ర నిర్వహిస్తున్నట్టే ఇక్కడా ఏటా జరుపుతున్న విషయం తెలిసిందే. స్థానిక శివాజీచౌక్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ఆరంభమైన యాత్రలో భక్తులు భారీగా పాల్గొన్నారు. విదేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు సంప్రదాయ దుస్తులతో హరేరామ హరేకృష్ణ అంటూ భజనలు చేస్తూ యాత్రలో ముందుకు సాగారు. చిన్నపిల్లలు దేవతా వేషధారణలతో కనిపించారు. కూచిపూడి శాస్త్రీయ నృత్యప్రదర్శనలు, జానపద డప్పువాయిద్యాలు, కోలాటం, భజనల కోలాహలం మధ్య యాత్ర రమణీయంగా సాగింది. స్వామి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధి సింహ గౌరదాస్ మాట్లాడుతూ పూరి జగన్నాథ స్వామిని రథయాత్రను దర్శించుకోలేని భక్తుల కోసం ఈ యాత్రను ఏటా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు ముకుంద మాధవ దాస్, చక్రధారిదాస్, పట్టణ ప్రముఖులు కొత్త సుబ్రహ్మణ్యం, ముమ్మలనేని జానకి రామచంద్రరావు, కిక్కూరి శ్రీనివాస్ రెడ్డి, సాగిరి కృష్ణమూర్తి పాల్గొన్నారు. అనంతరం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో స్వామి సేవలు, ప్రసాదవితరణ నిర్వహించారు.



తెనాలి శివాజీచౌక్‌లో జగన్నాథస్వామి రథయాత్రలో భక్తజనం

యార్డుకు 34,722 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 34,722 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 33,152 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 19,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 15,500 వరకు, ఏసీ ప్రత్యేక రకం రూ. 10,000 నుంచి రూ. 18,500 వరకు, తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. యార్డులో ఇంకా 15,887 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

వ్యవసాయ, విజిలెన్స్ అధికారుల తనిఖీలు

రూ.55.6 లక్షల విలువైన బయో ఉత్పత్తులు, ఎరువుల అమ్మకాలు నిలిపివేత



రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు

కొరిటెపాడు(గుంటూరు): ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాలు, గోదాముల్లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన వ్యవసాయ, విజిలెన్స్ అధికారుల ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపడుతున్నాయి. కోనసీమ జిల్లా ఏడీఏ కె.నాగేశ్వరరావు, ప్రకాశం జిల్లా ఏడీఏ బి.బాలాజీనాయక్, నెల్లూరు జిల్లా విజిలెన్స్ సీఐ సి.మాణిక్యరావు, గుంటూరు జిల్లా విజిలెన్స్ సీఐ ఎస్.శ్రీనివాసులురెడ్డి, గుంటూరు అర్బన్ ఏఓ బి.గౌతం ప్రసన్నలు తనిఖీలు కొనసాగిస్తున్నారు. ఐదో రోజు మంగళవారం జిల్లాలోని గుంటూరు నగరంతోపాటు తెనాలి, మేడికొండూరు, ప్రత్తిపాడు, మంగళగిరి మండలాల పరిధిలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నిల్వ కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఎరువులు, పురుగుమందుల డిపోలలో రికార్డులు సరిగా నిర్వహించని కారణంగా రూ.55.6 లక్షల విలువైన 6.88 టన్నుల బయో ఉత్పత్తులు, 219 టన్నుల ఎరువులు అమ్మకాలు నిలుపుదల చేశారు.

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ జులై 31, 2024

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు ఛాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.



సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు

మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.



సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు

మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు

రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250, మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు. 040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

క్లుప్తంగా

తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ

మంగళగిరి: యర్రబాలెం శ్రీనగర్ కాలనీలో చోరీ జరిగింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. శ్రీరామ్ కాలనీలో ఉంటున్న సురేష్ తన కుటుంబంతో కలిసి ఈనెల 6న ఊరికి వెళ్లాడు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టి ఉండడం చూసిన సురేష్ కుటుంబ సభ్యులు చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.15 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు మాయమైనట్టు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.2,200, గరిష్ఠ ధర రూ.3,700, మోడల్ ధర రూ.2,700 వరకు పలికింది.

జిల్లాలో విద్యావ్యవస్థపై దృష్టి సారించండి



నరసరావుపేట: జిల్లాలో విద్యావ్యవస్థపై దృష్టి సారించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. పల్నాడు జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.అరుణ్‌బాబును మంగళవారం కలెక్టరేట్‌లో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో విద్యారంగ పరిస్థితులు, పాఠశాలల స్థితిగతులు, సబ్జెక్ట్ ఉపాధ్యాయుల కొరత గురించి కలెక్టర్‌తో చర్చించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.ప్రేమకుమార్, జి.విజయసారథి విద్యారంగంలో ఇన్‌చార్జిల పాలన కొనసాగుతుందని, మండలాల్లో ఎంఈఓల నియామకాలపై దృష్టి సారించాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు.

వ్యాపారి ఆత్మహత్య

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పట్టణంలో అపరాల వ్యాపారి ఉరి వేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పట్టణంలోని దక్షిణం బజారుకు చెందిన గుడివాడ లక్ష్మీనారాయణ (62) మధ్యాహ్నం సమయంలో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూసేటప్పటికే లక్ష్మీనారాయణ మృతి చెందాడు. ఆయన మృతికి ఆర్థిక ఇబ్బందులు కారణమా?, మరేమైనా ఇతర సమస్యలు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పూర్తి స్థాయిలో పోలీసులు దర్యాప్తు చేస్తేనే నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. నాయకుడు వాసిరెడ్డి రవి ఉన్నారు.

అగ్రి స్టార్టప్‌ల శిక్షణకు కృషి చేద్దాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ డాక్టర్ శారదజయలక్ష్మీదేవి

గుంటూరు రూరల్: వ్యవసాయ రంగంలో ఔత్సాహిక యువతకు అగ్రి స్టార్టప్‌ల ద్వారా విస్తృతస్థాయిలో వ్యాపార అవకాశాలు కల్పించే దిశగా శిక్షణ ఇచ్చేందుకు కృషిచేస్తున్నామని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాంఫాం ఆడిటోరియంలో జరిగిన వర్క్‌షాప్‌లో వీసీ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అన్ని రకాల ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చేందుకు ప్రస్తుతం తిరుపతిలో ఒకే ఒక్క కేంద్రం పనిచేస్తోందని, ఈ తరహా కేంద్రాలను మరిన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు శాస్త్రవేత్తలు కృషిచేయాలని సూచించారు. పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం పరిధిలో పరిశోధన ఫలితాలను, వ్యవసాయ ఆవిష్కరణలను అగ్రి స్టార్టప్‌ల ద్వారా మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అగ్రికల్చర్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ ఎ.మణి మాట్లాడుతూ అగ్రిస్టార్టప్‌లను విస్తరించాలని పేర్కొన్నారు. డీన్ డాక్టర్ జి కరుణాసాగర్ మాట్లాడుతూ 2020 నుంచి అమలులోకి వచ్చిన నూతన విద్యావిధానంలో వ్యవసాయ విద్యార్థులనూ స్టార్టప్‌లలో లింక్‌చేసి వారిలోని నైపుణ్యాలను వెలికి తీసి వినియోగించుకోవాలని సూచించారు. రెండు రోజులపాటు జరిగే బిల్డింగ్ అగ్రి ఇన్నోవేషన్స్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇంక్యుబేషన్ ఇన్ అంగ్రూ అనే కార్యక్రమం బుధవారంతో ముగియనుంది. ఏడీఆర్ డాక్టర్ ఎస్‌వీఎస్ దుర్గాప్రసాద్, విశ్వవిద్యాలయం పోషణ్ ఇంక్యూబేటర్ అధిపతి డాక్టర్ కదిరి మోహన్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

దేశ సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

- ఇండియన్ నావెల్ అకాడమీ సబ్ లెఫ్టినెంట్ సాయిరామ్
- ఆర్‌వీఆర్‌జేసీలో స్టార్టప్ అండ్ కెరీర్ ఆపర్చునిటీస్ ఇన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌పై సదస్సు


ఇండియన్ నావెల్ అకాడమీ సబ్ లెఫ్టినెంట్ సాయిరామ్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: భారత రక్షణ దళాలలోని ఉద్యోగ అవకాశాలను సద్వినియోగించుకుంటూ, దేశ సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఇండియన్ నావెల్ అకాడమీ (కేరళ) సబ్ లెఫ్టినెంట్ సాయిరామ్ సూచించారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన స్టార్టప్ అండ్ కెరీర్ ఆపర్చునిటీస్ ఇన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌పై సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు కవాతు నిర్వహించి గౌరవ స్వాగతం పలికారు. సాయిరామ్ మాట్లాడుతూ భారత రక్షణ దళాల్లో బీటెక్ విద్యార్థులకు గల ఉద్యోగ అవకాశాలను వివరించారు. విద్యాభ్యాస సమయంలోనే విద్యార్థులు ఒక మంచి లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. భారత సైనిక త్రివిధ దళాలలోని సైనికులకు ఉద్యోగ భద్రతతోపాటుగా, కుటుంబ సభ్యులకు ప్రత్యేకమైన విద్యా, వైద్య సేవలతో వివిధ రకాల సౌకర్యాలు కేంద్ర ప్రభుత్వం నుంచి లభిస్తాయని వివరించారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్‌లు మాట్లాడుతూ ఇండియన్ నావెల్ అకాడమీ(కేరళ)సబ్ లెఫ్టినెంట్‌గా ఉన్నత పదవిలో దేశరక్షణ వ్యవస్థలో సేవలందిస్తున్న సాయిరామ్ తమ కళాశాల పూర్వ విద్యార్థి కావడం సంతోషకరమని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ వి.తారాచంద్ తదితరులు ముఖ్యఅతిథిని సన్మానించారు.

‘పీఎం పోషణ్’ మెనూ పాటించాలి


మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలిస్తున్న ఏపీసీ విజయలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న పీఎం పోషణ్ (మధ్యాహ్న భోజన పథకం)లో మెనూను విధిగా పాటించాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం కొత్తపేటలోని జలగం రామారావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలను సందర్శించిన విజయలక్ష్మి మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలించారు. ఏపీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు ఉద్దేశించిన పీఎం పోషణ్ పథకాన్ని సమర్థంగా అమలు జరిగేలా చూడటంలో ప్రధానోపాధ్యాయులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. ఆమె వెంట తూర్పు ఎంఈవో నాగేంద్రమ్మ, పాఠశాల హెచ్‌ఎం సుధారాణి ఉన్నారు.

మహిళా పాలిటెక్నిక్ విద్యార్థినులకు ఏఐసీటీఈ ఉపకార వేతనాలు



గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో చదువుతున్న ఆరుగురు విద్యార్థినులు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) అందించే ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులు ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఏఐసీటీఈ ప్రగతి ఉపకార వేతనాలు అందించి, ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా తమ కళాశాలలో డిప్లొమా ప్రథమ సంవత్సరం చదువుతున్న వారిలో 30 మంది విద్యార్థినులు దరఖాస్తు చేసుకోగా, వారిలో ఆరుగురు ఎంపికైనట్లు వివరించారు. కుంచాల వైష్ణవి, వాసిమళ్ల బ్యూలా, కానో జియా దేవంతి, సిరిపురపు హర్షిత, క్రోసూరి రుషిత, సోమరౌతు లిఖిత వేదసాయి మాన్వితకు ఏడాదికి రూ.50 వేలు చొప్పున మూడేళ్లపాటు అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి బి. రామసుందరి, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్వారీ గుంతలో పడి యువకుడి ఆత్మహత్య

దాచేపల్లి: క్వారీ గుంతలో పడి యువకుడు



ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం జరిగింది. ఎస్‌ఐ జీ.సంధ్యారాణి తెలిపిన వివరాలు ఇలా.. మాచవరం మండలం వేమవరానికి చెందిన ఉప్పుతోళ్ల తిరుపతయ్య(21) మద్యానికి బానిసగా మారాడు. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ పెట్రోల్ బంకులో పని చేస్తున్న క్రమంలో అతిగా మద్యం తాగి విధులకు హాజరుకావడంతో యజమానులు విధుల నుంచి తొలగించారు. నాలుగు రోజుల కిందట వేమవరం వచ్చి తండ్రి వద్దనే ఉంటున్నాడు. మద్యానికి బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నావని తండ్రి మందలించి, మద్యం తాగకుండా అడ్డుకున్నాడు. దీంతో ఇంటి నుంచి బయలుదేరిన తిరుపతయ్య నడికుడి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. స్టేషన్ సమీపంలోని క్వారీ గుంతలో దిగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు స్థానికుల సహాయంతో నీళ్లలో తేలాడుతున్న మృతదేహాన్ని ఒడ్డుకు తీయించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు అవివాహితుడు.

గణపవరంలో చోరీ

రూ.40 వేలు అపహరణ


దుండగులు నగదు కాజేసిన బ్యాగు

నాదెండ్ల: గణపవరం రామ్‌నగర్‌లో ఓ ఇంట్లో చోరీ సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. శాంతినగర్ రామాలయం వెనుక బజారులో నివాసం ఉండే కొత్తకోట లక్ష్మి, భర్త ప్రసాద్ చిలకలూరిపేట పట్టణంలో కూలి పనులకు వెళ్తుంటారు. వీరి కుమారుడు గుంటూరులో ఉద్యోగం చేస్తుంటాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి తాళాలు పగలగొట్టి బీరువా తెరిచారు. పక్కనే బ్యాగులో ఉన్న రూ.40 వేల నగదు అపహరించారు. దీనిపై బాధితురాలు లక్ష్మి నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. గణపవరంలో వరుస దొంగతనాలతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

రిటైర్డ్ ఐఏఎస్ శ్యామ్యూల్ ఆనంద్


వడ్లమూడిలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న రిటైర్డు ఐఏఎస్ శ్యామూల్ ఆనంద్ తదితరులు

చేబ్రోలు: ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు ఉన్నాయని రిటైర్డు ఐఏఎస్ శ్యామ్యూల్ ఆనంద్ చెప్పారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలో రైతు ఎస్.ఉమామహేశ్వరరావు పొలంలో 30 రకాల పంటల వైవిధ్యంతో కూడిన పీఎండీఎస్ క్షేత్రాన్ని అధికారుల బృందం సందర్శించి సంతృప్తి వ్యక్తం చేసింది. ప్రధాన పంటల కంటే ముందుగా 30 రకాల జీవ వైవిధ్య పంటలతో కూడిన పచ్చిరొట్ట పంటలు వేసిన రైతు పొలంలో నత్రజని స్థిరీకరించే రైజోబియం, వేరు బుడిపెలు విస్తారంగా అభివృద్ధి చెందడాన్ని గుర్తించింది. ఈ సందర్భంగా రిటైర్డు ఐఏఎస్ శ్యామ్యూల్ ఆనంద్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.రాజకుమారి తదితరులు మాట్లాడుతూ ప్రధాన పంటల సాగులో వేరు వ్యవస్థ ప్రధానమైందన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ పర్యవేక్షకులు వెంకట్రావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది స్థానిక రైతులు పాల్గొన్నారు.

డయేరియాతో కార్మికుడు మృతి

పిడుగురాళ్ల: డయేరియా వ్యాధితో సున్నపు బట్టి కార్మికుడు మృతి చెందాడు. పట్టణంలోని లెనిన్‌నగర్‌కు చెందిన తిరుమలకొండ ఆంజనేయులు(60) గత శనివారం వాంతులు విరేచనాలు కావటంతో మారుతీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో చేరారు. అక్కడ వైద్య సేవలు పొందాడు. మెరుగైన వైద్యం కోసం ఆదివారం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషయంగా ఉండటతో వైద్యులు గత సోమవారం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

ఆంజనేయులు మృతికి కార్మిక, ప్రజాసంఘాల నివాళి..

డయేరియాతో మృతి చెందిన తిరుమలకొండ ఆంజనేయులు భౌతికకాయాన్ని కార్మిక, ప్రజా సంఘాల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, సీపీఐఎం జిల్లా అధ్యక్షులు ఓర్సు కృష్ణ, సెంట్రల్ ట్రేడ్ యూనియన్ నాయకులు వీర్లంకయ్య, కోటేశ్వరరావు, నారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి జె. కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక గృహిణి ఆత్మహత్య

నాదెండ్ల: కడుపు నొప్పి తాళలేక గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఎండుగుంపాలెం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుడికందుల విజయశాంతి (35) కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధపడుతోంది. వైద్యులకు చూపినా ఫలితం లేకపోవటంతో సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో గడ్డిమందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన నరసరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త సాంబశివరావు వ్యవసాయ పనులు చేస్తుంటాడు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఒంటిపై పెట్రోలు పోసుకొని వ్యక్తి ఆత్మహత్య

అమర్తలూరు(వేమూరు) : ఒంటిపై పెట్రోలు పోసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అమర్తలూరులో మంగళవారం జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు గ్రామానికి చెందిన మానుకొండ దిలీప్(35) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో సోమవారం రాత్రి డిశ్చార్జి చేశారు. దీంతో మనస్తాపం చెంది మంగళవారం ఇంటి నుంచి బయటి వెళ్లి మద్యం తాగాడు. ఆ తర్వాత మత్తులో ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పు అంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు


ఫిరంగిపురంలో బాధితులకు సాయం అందజేస్తున్న మందపాటి శేషగిరిరావు, మేకతోటి దయాసాగర్

తాడికొండ/ఫిరంగిపురం: కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు చెప్పారు. ఎన్నికల ఫలితాల రోజున తుళ్ళూరు మండలం వడ్డమాను గ్రామంలో కార్యంశెట్టి వెంకట్రావు ఇంటిపైకి వచ్చి టీడీపీ నాయకులు దాడి చేసి కొట్టారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, విశ్రాంత ఇన్‌కమ్‌టాక్స్ కమిషనర్ మేకతోటి దయాసాగర్‌తో కలిసి శేషగిరిరావు మంగళవారం పరామర్శించేందుకు వచ్చారు. ఘటన జరిగిన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో కక్షపూరిత వాతావరణం కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీకి వెన్నుదన్నుగా ఉన్న వారి ఇళ్లు, ఆస్తులు, వ్యక్తులపై దాడులు చేయడం, ప్రభుత్వ శిలాఫలకాలు తగలబెట్టడం, పార్టీ ఆఫీసులు కూలగొట్టడం, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలు పగలగొట్టడం, తగలబెట్టడం వంటి అనాగరిక చర్యలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యంశెట్టి వెంకట్రావుకు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని పార్టీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకతోటి సుచరిత, దయాసాగర్‌ల ఆధ్వర్యంలో అందించినట్టు వివరించారు. కార్యక్రమంలో వారి వెంట పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బత్తుల కిషోర్, రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకట శివారెడ్డి, సీనియర్ నాయకులు కొప్పుల శేషగిరిరావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు చుండు వెంకటరెడ్డి, గ్రామపార్టీ అధ్యక్షుడు గొట్టం నర్సిరెడ్డి, కార్యంశెట్టి వెంకటేశ్వరరావు, పెరికల పాములు, మేకం వెంకటేశ్వరరావు, ఆరేపల్లి జోజి పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో..

ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ నేతల దాడిలో ఫిరంగిపురంలోని శాంతిపేటకు చెందిన యువకులు ఎన్.సాయి, ఎన్.సాగర్‌బాబు గాయపడ్డారు. వీరిని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, రిటైర్డు ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్ మంగళవారం సాయంత్రం పరామర్శించారు. అనంతరం బాధితులకు రూ.50 వేల చొప్పున సాయం అందజేశారు. వీరి వెంట జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డి, సర్పంచి మేడాబాబు, ఎస్.రాయప్ప, ఎస్.చిన్నప్ప, పి.చిన్న, టి.డేవిడ్, డి.సురేష్, బి.అంజిరెడ్డి, ఇశ్రాయిల్ ఉన్నారు.


వడ్డమానులో కార్యకర్త కార్యంశెట్టి వెంకట్రావును పరామర్శించి చెక్కును అందజేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, దయాసాగర్

ఇసుక సరఫరాలో అక్రమాలకు పాల్పడితే చర్యలు


కొల్లిపరలో ఇసుక స్టాక్ యార్డును పరిశీలిస్తున్న తెనాలి డీఎస్పీ రమేష్ బాబు

కొల్లిపర: ఉచిత ఇసుక సరఫరాలో అక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెనాలి డీఎస్పీ ఎం.రమేష్ బాబు చెప్పారు. కొల్లిపర, మున్నంగిలలో ఉన్న స్టాక్‌పాయింట్లను మంగళవారం డీఎస్పీ రమేష్ తనిఖీ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఉచిత ఇసుక సరఫరా జరుగుతుందని చెప్పారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టినట్టు వివరించారు. ఈ విషయంపై తెనాలి రూరల్ సీఐ పి.వెంకటేశ్వర్లు స్థానిక ఎస్సై ఆర్.రవీంద్రారెడ్డిలకు డీఎస్పీ సూచనలు చేశారు. ఆన్‌లైన్ చెల్లింపుల విధానం పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ట్రాక్టర్లు ఐదు టన్నులకు రూ.1250, ఆరు చక్రాల లారీ 10 టన్నులకు రూ.2,500, 10 చక్రాల లారీ 20 టన్నులకు రూ.5,000 ఆన్‌లైన్‌లో చెల్లిస్తే ఇసుక లోడ్ చేస్తారని చెప్పారు. టన్ను ఒక్కొక్కటికి రూ.250 చొప్పున ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు.

గణితం జీవితంలో భాగం


సదస్సులో ప్రసంగిస్తున్న కేఎల్‌యూ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ

తాడేపల్లిరూరల్ : గణితం మన జీవితంలో భాగమని కేఎల్‌యూ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ చెప్పారు. మంగళవారం వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో నాలుగో అంతర్జాతీయ గణిత విభాగ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ ఎన్‌ఐటీ తిరుచురాపల్లి నుంచి వచ్చిన డాక్టర్ వి.లక్ష్మణ గోమతి నయగమ్ గణితం ఆవశ్యకతను, ఇతర విభాగాలతో అనుసంధానమైన సమస్యలను విద్యార్థులకు వివరించారు. కేరళ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ జి.సురేష్ సింగ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గణిత శాస్త్రవేత్తల అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కేఎల్‌యూ ప్రొ. వైస్ చాన్సలర్ డాక్టర్ కెఎస్ జగన్నాథరావు మాట్లాడుతూ వైద్యులకూ రోగులను పరీక్షించి వ్యాధిని నిర్ధారించుటకు గణితం అవసరమవుతుందని చెప్పారు. తమిళనాడులోని గాంధీగ్రామ్ రూరల్ ఇనిస్టిట్యూట్ నుంచి విచ్చేసిన డాక్టర్ జి.మహదేవన్ గ్రాఫ్ థీరీ మెడికల్, డిజిటల్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారంలో గణితం ప్రాముఖ్యంపై పరిశోధనా పత్రాన్ని ప్రదర్శించారు. కేఎల్‌యూ గణిత విభాగాధిపతి ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ బి.వి.అప్పారావు మాట్లాడుతూ ఈ సదస్సు మరో నాలుగు రోజులు కొనసాగుతుందని, ఈ సదస్సులో దేశ వ్యాప్తంగా ఆయా విశ్వవిద్యాలయాల నుంచి సుమారు 200 మంది పరిశోధనా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని తాము రూపొందించిన పరిశోధనా పత్రాలను సమర్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మతోపాటు ప్రొ. వీసీలు డాక్టర్ ఎ.వి.ఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎఫ్.ఇ.డి. డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్, ఎఫ్.ఇ.డి. ప్రిన్సిపల్ డాక్టర్ వి. కృష్ణారెడ్డి, సైన్స్ కళాశాలల ప్రిన్సిపల్ డాక్టర్ కె. సుబ్రహ్మణ్యం, సదస్సు కన్వీనర్ డాక్టర్ కె.రేణుక పాల్గొన్నారు.

80 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం


చేబ్రోలు గ్రామ శివారులో రేషన్ బియ్యం లారీని స్వాధీనం చేసుకున్న పోలీసులు

చేబ్రోలు: నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా రేషన్ బియ్యాన్ని లారీలో తరలిస్తున్న వాహనాన్ని చేబ్రోలు పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు వైపు నుంచి పొన్నూరు వైపునకు టాటా ఇంట్రా లారీ వాహనంలో 80 బస్తాల్లో సుమారు నాలుగు టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ పి.మహేష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది స్థానిక సినిమా హాలు సమీపంలో బియ్యం లారీని అదుపులోకి తీసుకున్నారు. గుంటూరు శివనాగరాజు నగర్ 12వ లైనుకు చెందిన తమ్మిశెట్టి వీరాస్వామి, గుంటూరు రూరల్ మండలం దాసరిపాలెంకు చెందిన కొమిర వీరాస్వామిలను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. ఘటనపై చేబ్రోలు ఎస్‌ఐ పి.మహేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు


విజేత జట్టుకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ హనీమెహత తదితరులు

గుంటూరు రూరల్: క్రీడల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని నల్లపాడు పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ హనీమెహత తెలిపారు. మంగళవారం విద్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న క్లస్టర్ స్థాయి కబడ్డీ పోటీలు ముగిశాయి. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ హైదరాబాద్ రీజియన్ ఆదేశాల మేరకు ఈనెల 8, 9 తేదీలలో అండర్-17 బాలికల ప్రాంతీయ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించామని పేర్కొన్నారు. వివిధ క్లస్టర్ల నుంచి 84 మంది క్రీడాకారులు, ఏడు జట్లు పోటీలో పాల్గొన్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఆరుగురు అధికారుల బృందం మ్యాచ్‌లను నిర్వహించినట్టు వెల్లడించారు. రెండు రోజులపాటు జరిగిన క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అండర్ 17 విభాగంలో హోరాహోరీగా సాగిన పోటీలో అనంతపురానికి చెందిన కబడ్డీ జట్టు విజేతగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో స్కూల్ నామినీ చైర్మన్ బి రవికుమార్, ఉపాధ్యాయులు టి లక్ష్మీప్రసన్న, ఎస్ ఆనంద్, సునీల, పీఈటీలు అంజలి, ఆర్ చాంగ్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ Exams Aug-2024 B.Tech, M.Tech, MBA, MCA, MSc, BBA, BCA, B.Com, B.Sc, BA, B.Sc(Agriculture), BPT, DMLT B.Sc(MLT). Contact: 7386406839

REAL ESTATE
■ AP రాజధాని అమరావతి, తుళ్ళూరులో 8kmలో గII8000/-, మంగళగిరికి 3kmలో గII 12000/-, కమర్షియల్ ఫ్లాట్ 20 లక్షలు 15000/- Rent లోన్ కలదు. సంప్ర: 96035 30555

అమ్మకం
■ తెనాలి ఐతానగర్‌లో 209 చ॥గ॥ G+1 దాబా & పూరిల్లు అమ్మకమునకు కలదు. జెన్యూన్ పార్టీలు మాత్రమే సంప్రదించగలరు. ✆ 81003 59201

SERVICES
GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

WANTED
■ గర్ల్స్ హాస్టల్ ఇన్‌ఛార్జ్‌లుగా పనిచేయుటకు స్త్రీలు కావలెను. జీతము: 10000/- to 12000/- వరకు ఇవ్వబడును. Age: 20+, Qualification: SSC, ఉచిత భోజనం మరియు వసతి ఇవ్వబడును. పనిచేయు స్థలం గుంటూరు. Master Minds. Contact: 91000 24059
■ DTP/ గ్రాఫిక్ డిజైనర్స్ హైదరాబాద్, గుంటూరు, విజయవాడ లలో పనిచేయుటకు డిగ్రీ, ఇన్‌డిజైన్, ఫోటోషాప్, తెలుగు యాపిల్ కీబోర్డ్‌పై అనుభవం ఉన్నవారు రెజ్యూములను hoadvtjobs@gmail.com కు పంపగలరు.
■ Wanted Teachers for KG to 5th, P.E.T, incharges, classical & study hours teachers. Fluency in English is must. Montessori Schools GNT ✆ 8121400100
■ నాగసాయిఏజెన్సీ ఏషియన్ పెయింట్ షాపు నందు పనిచేయుటకు Tally తెలిసిన కంప్యూటర్ ఆపరేటర్స్ M/F కావలెను. XXX సోప్స్ కంపెనీ గోరంట్ల, గుంటూరు ✆ 9440715763
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9848868206, 9573633520.
■ Bright Kids School నందు పనిచేయుటకు fluence English ఉన్న Head Master 10th English Social Telugu Hindi బోధించుటకు అనుభవం కలిగిన టీచర్లు కావలెను. 7780494333
■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 15-28 వేలు. కాల్/ వాట్సాప్ చేయగలరు. సంప్ర. సెల్ : 95026 15217
■ మా సంస్థ నందు పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ వర్క్ చేయుటకు యువతి/యువకులు కావలెను. ఆకర్షణీయమైన సంపాదన. సంప్ర: 70328 56389
■ వంట మనిషి కావలెను. గుంటూరు పట్టణములో ఏ.టి. అగ్రహారం నందు గృహములో వెజ్ మరియు నాన్ వెజ్‌లో అన్ని రకముల వంటలు చేయుటకు అనుభవము కలిగిన (ఆడ) వంట మనిషి కావలెను. ✆ 9398991579
■ నిజాంపట్నం మరియు విజయవాడ ఏరియాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ అర్జెంటుగా కావలెను. రూం + మీల్స్ కలదు. మంచి జీతం. ✆ 8500405004, 8985422255
■ శ్రీగౌతమి డిగ్రీకళాశాల, NGOకాలనీ, గుంటూరు నందు కంప్యూటర్ సైన్స్, మ్యాథమేటిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు బోధించుటకు అర్హత అనుభవం గలవారు కావలెను. mgcgnt@yahoo.com ✆ 98853 06573, 70322 85130
■ హరేకృష్ణ హోంకేర్, విజయవాడ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 18K. Ph: 9640528899, 9640648899

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.